క్లుప్తంగా

సామాజిక కానుక పింఛన్ల పంపిణీ పూర్తి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో శనివారం సామాజిక పింఛన్‌ల ప్రక్రియ పూర్తయ్యేది. పట్టణంలోని 40 వార్డుల పరిధిలోని సచివాలయాలలో మిగిలిన వాటిని పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న వారికి మాత్రం వారి ఇళ్లకు వెళ్లి సచివాలయ ఉద్యోగులు వాటిని పంపిణీ చేశారు. నూరు శాతం పంపిణీ పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



తూములూరు(కొల్లిపర): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి పౌరుడు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించాలని వీఆర్వో రామారావు కోరారు. మండలంలోని తూములూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో అధికారులు ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచి మర్రెడ్డి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. అనతరం గ్రామంలో ఓటు హక్కు పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓ ప్రసాద్, ప్రచాయతీ కార్యదర్శి మృత్యుంజయరావు, ఉయ్యూరు ఉమామహేశ్వరెడ్డి, ఈదా హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిని నియంత్రణకు పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాధిక పేర్కొన్నారు. జిల్లా వైద్యశాలలోని టీబీ యూనిట్‌లో కోహెన్స్ వారి సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు శనివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ సిబ్బంది రవికుమార్, లక్ష్మి, భార్గవి, దిలీప్, పావని పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థిగా అజయ్‌కుమార్



తెనాలిఅర్బన్: ఇండియా కూటమిని ప్రజలందరూ ఆదరించాలని కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ కోరారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శనివారం కూటమి అభ్యర్థి అజయ్‌కుమార్‌ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం తరువాత ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, నాయకులు బొల్లిముంత కృష్ణ, పాశం వెంకటేష్, రాజేష్, శివ, పరుచూరి వెంకటేశ్వరరావు, కొత్త శశికిరణ్, గణేష్, యశ్వంత్ పాల్గొన్నారు.

రేపు స్వరలయ వేదిక ఉగాది వేడుకలు

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించనున్న వేడుకలకు ఏపీ జేఏసీ, అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. ఇదే వేడుకల్లో ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఎం.రామలింగేశ్వరరావు, ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నాయకుడు వేదాంతం ఫణీంద్ర, సామాజిక సేవకుడు షేక్ ఇనయతుల్లాను ఉగాది పురస్కారాలతో సత్కరించనున్నట్లు చెప్పారు.

అంతరంగ సంస్కరణే అద్భుత ఔషధం

తాడేపల్లి రూరల్ : సమాజంలో అంతర్గతంగా జరుగుతున్న నేరాలన్నింటికీ మనుషుల అంతరంగంలో చోటు చేసుకుంటున్న విపరీత ధోరణులే ప్రధాన కారణమని మాజీ డీజీపీ డాక్టర్ ఎం. మాలకొండయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్గత భద్రత, సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాలకొండయ్య ప్రసంగిస్తూ.. మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు వంటి అంశాలను బూచిగా చూపి ఆ ముసుగులో నేరాలకు పాల్పడేవారు కొందరైతే, నేరాన్ని వృత్తిగా మలచుకొని జీవించేవారు ఇంకొందరన్నారు. ఇలాంటి అంశాలపై యువత అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను సూచించారు. ఆరోగ్యవంతమైన శరీరంలోనే స్థిర చిత్రమైన మనసు ఉంటుందన్నారు. బిఏఎంఎస్ విభాగాధిపతి డాక్టర్ బి. శివనాగయ్య మాట్లాడుతూ నేటి పోటీ పరీక్షల్లో అంతర్గత భద్రత అనే అంశం చాలా కీలకమైనదన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థ సారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎంహెచ్‌ఎస్ డీన్ ఎం.కిశోర్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలి

- ప్రజల నమ్మకానికి అనుగుణంగా పనిచేశాం
- పార్ట్‌టైమ్ లీడర్‌గా కాకుండా ఫుల్‌టైమ్ లీడర్‌గా ఉన్నా
- ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు నాకే ఉందని భావిస్తున్నా
- బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: ప్రజలకు ఇంతగా మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. స్థానిక రామలింగేశ్వరపేటలో బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్ట్ టైమ్ లీడర్‌లా కాకుండా ఫుల్‌టైమ్ ప్రజల్లో ఉన్నట్లు చెప్పారు. మళ్లీ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు తనకే ఉందన్న భావనతో మళ్లీ వారి దగ్గరకు వస్తున్నానని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తాను ఏనాడూ దుర్వినియోగం చేయలేదని చెప్పారు. ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులతో సహా ఏ వృత్తిలో ఉన్నవారినీ ఇబ్బంది పెట్టలేదని స్పష్టం చేశారు. మరొకరికి ఆ అవకాశం ఇవ్వలేదన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలను పట్టించుకున్నదీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. ఈబీసీ నేస్తం పథకం కింద ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని పట్టణంలో 370 మంది బ్రాహ్మణ కుటుంబాలకు అందించినట్లు గుర్తు చేశారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయటంతోపాటు పట్టణాల్లో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించినట్టు చెప్పారు. అక్కడ 64 పరీక్షలు, మందులతో సహా ఉచిత వైద్యసేవలు అందుతున్నాయని వివరించారు. సామాన్యుల కొనుగోలు శక్తిని పెంచటం కూడా అభివృద్ధిగానే భావించాలన్నారు. పుచ్చా విజయ్‌కుమార్, అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కోట పార్థసారథి, చెరుకుపల్లి నరసింహమూర్తి, డాక్టర్ నారాయణం వేణుగోపాల్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం ఘనత వైఎస్ జగన్‌దే

- నాయీబ్రాహ్మణులకు రాజకీయ భాగస్వామ్యం
- ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్, పక్కన యానాదయ్య, పుల్లయ్య, సునీత

తెనాలి: అన్ని సామాజిక వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆత్మీయ సదస్సును శుక్రవారం రాత్రి స్థానిక కొత్తపేటలోని దేవీప్రియ కల్యాణమండపంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం తీసుకొచ్చిన సామాజిక విప్లవం ఫలితంగానే అన్ని వర్గాలకు రాజకీయ భాగస్వామ్యం లభించిందన్నారు. ముఖ్యమంత్రిని, తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

సేవకులను పాలకులుగా చేసిన ఘనత..

ఆంధ్రప్రదేశ్ బీసీ జేఏసీ కన్వీనర్, టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దావటం యానాదయ్య మాట్లాడుతూ పేదవర్గాల భవిష్యత్‌కు సంబంధించిన ప్రస్తుత ఎన్నికల్లో సేవకులను పాలకులుగా చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. చట్టసభలకు దూరంగా ఉన్న కులాలను చేయిపట్టి నడిపించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని హెచ్చరించిన చంద్రబాబు, ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదని గుర్తుచేశారు.ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు అండగా నిలుస్తున్న జగన్ కావాలా? అవమానించిన చంద్రబాబు కావాలా? అనేది తేల్చుకోవాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు మండపాటి శేషగిరిరావు మాట్లాడుతూ బీసీలు, ఎస్సీలంటే చంద్రబాబుకు చిన్నచూపని చెప్పారు. సీఎం జగన్ అందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నారని తెలిపారు. సేవాసంఘం అధ్యక్షుడు రిమ్మనపూడి నరసింహారావు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించిన ఎమ్మెల్యే శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కురగంటి రవిశంకర్, కోశాధికారి కాకాని వెంకటేశ్వర్లు, కురగంటి సునీత, మున్నంగి చినపాములు, గోనుగుంట ప్రసాద్, టి.దామోదర్, డాక్టర్ శ్రీనివాస్, ఎం.సుబ్రహ్మణ్యం, కె.సుబ్రహ్మణ్యం, టి.సుబ్బారావు పాల్గొన్నారు. నాయీబ్రాహ్మణులకు చేసిన మేలుపై కరపత్రాన్ని ఎమ్మెల్యే శివకుమార్ ఆవిష్కరించారు. కోలా వాసు స్వాగతం పలికారు.

సంక్షేమ ఆంధ్రప్రదేశ్ జగన్‌తోనే సాధ్యం



మహిళకు కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప



కొల్లిపరలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చిన్న కుమారుడు అఖిల్‌గణేష్

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 32వ వార్డులో శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరగనున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు అందరు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో 32వ వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మి కుమారి, పార్టీ నాయకులు మట్టపూడి రాజేశ్వరరావు, ఈద్గా గౌస్, చెరుకూరి సురేష్ పాల్గొన్నారు.

కొల్లిపరలో..

కొల్లిపర: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చిన్న కుమారుడు అఖిల్‌గణేష్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం మండల కేంద్రంలో బ్రహ్మంగారి మఠం దగ్గర నుంచి ఇంటింటికి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవ రెడ్డితో కలసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి పిల్లి రాధిక, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు బట్టిప్రోలు వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఉపసర్పంచి అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కె.శ్రీలత, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, నాయకులు నెర్ల కుటుంబరెడ్డి, కళ్లం వీరారెడ్డి, పిల్లి గంగాధర్, మంద్రు రాజు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు ఫెస్ట్‌లు దోహదం

మోతడక(తాడికొండ): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రదర్శించి వెలికితీసేందుకు ప్లాట్‌ఫామ్‌గా సాంకేతిక ఫెస్ట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని శాప్ ప్రతినిధులు జయంత్ బగారే, భరత్ ప్రసాద్‌లు అన్నారు. మోతడక చలపతిలో పీఎస్‌జీ టెక్నాలజీ, శాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐటెక్ హ్యాక్ ఫెస్ట్– 2024 రీజనల్ రౌండ్ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు రియల్ వరల్డ్ సమస్యలకు, ఇన్నోవేటివ్ ఐడియాలను ప్రదర్శించడానికి, పరిశ్రమ మరియు అకడమిక్ ప్రతినిధులతో తమ అభిప్రాయాలను పంచుకునేందుకు వారి అనుభవాల నుంచి విలువైన విషయాలను నేర్చుకోవడానికి ఉపయోగ పడుతుందన్నారు. మొత్తం 112 టీమ్‌లు పాల్గొని తమ ఐడియాలను క్లౌడ్‌సోర్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, గ్రీన్ క్రెడిట్ మేనేజ్‌మెంట్, రివల్యూషనైజింగ్ టుమారో హార్వెసింగ్‌కు సంబంధించిన అంశాలపై జ్యూరీ మెంబర్స్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 20 మంది జ్యూరీ మెంబర్లు 10 ప్యానల్స్‌గా ఏర్పడి పోటీలకు వచ్చిన 112 టీమ్‌ల నుంచి 10 టీమ్‌లను తదుపరి రౌండ్స్‌కు ఎంపిక చేశారు. ఈ టీమ్‌లకు కళాశాల సెక్రటరీ వై.సుజిత్ కుమార్ రూ.5వేలు చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ఐడియాలలో తుపాను బాధిత ప్రాంతాలలో సహాయ చర్యలకు కృత్రిమ మేధను ఉపయోగించి సత్ఫలితాలు సాధించడం, అటవీ ప్రాంతంలో నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించి వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడం వంటివి అందరినీ ఆకర్షించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌లు ఎస్.శాంతి ప్రియ పాల్గొన్నారు.

మణిపాల్‌కు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ ఆసుపత్రికి రోబోటిక్ ఇన్నోవేటివ్ సర్జరీలో చేసిన కృషికి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కంటిపూడి సుధాకర్ వివరాలు వెల్లడించారు. రోబోటిక్ శస్త్రచికిత్సలో ఆసుపత్రి చూపిన ప్రతిభను రోబోటిక్ ఇన్నోవేటివ్ సర్జన్స్ అసోసియేషన్ గుర్తించి ఈ పురస్కారానని ప్రకటించిందని తెలిపారు. సంప్రదాయ ఓపెన్ సర్జరీతో పోలిస్తే చిన్న కోత, తక్కువ నొప్పి, తొందరగా కోలుకునేలా రోబోటిక్ శస్త్ర చికిత్స ఉంటుందన్నారు. వైద్యులు డాక్టర్ సురేంద్రజాస్తి మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీతో రోగుల సంరక్షణలో మెరుగైన పరివర్తనను ప్రత్యక్షంగా చూశామన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

నగర ప్రజల దాహార్తి తీరేలా!

- రూ.39 లక్షలతో 40 చలివేంద్రాలు ఏర్పాటు
- చలివేంద్రాల వద్ద వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల బోర్డులు సైతం ఏర్పాటు



నగరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

మంగళగిరి: వేసవిలో నగరానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. నగరంలోని పలు కూడళ్లతో పాటు విలీన గ్రామాలలోను చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతున్నారు. నగరంలో రూ.39లక్షలతో 40 చలివేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. చల్లని కుండలలో తాగునీటిని నింపి ఒక మనిషిని ఏర్పాటు చేసి వాహనదారులు, పాదచారుల దాహం తీరుస్తున్నారు. నగరంలో ఎన్ఆర్ఐ వై.జంక్షన్, పాతబస్టాండ్, కార్పొరేషన్ కార్యాలయం, రత్నాల చెరువు, ఎంఎస్ఎస్ నగర్, టిడ్కో నివాసాలు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, వడ్లపూడి సెంటర్, మిద్దె సెంటర్, గాంధీ బొమ్మ, చినకాకాని ఆర్చ్, కాజలతో పాటు విలీన గ్రామాలలో పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అధికంగా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు, పంచాయతీ కార్యాలయాలకు, సచివాలయాలకు వస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆయా కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఎండలు అధికంగా ఉన్న కారణంగా ఎండలలో ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో సూచక బోర్డులు ఏర్పాటు చేయడం ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చడంతో ఆరోగ్య పరిరక్షణకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజలు కొనియాడుతున్నారు. ఎండ అధికంగా ఉన్న సమయంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు.

క్రోధినామ సాహితీ వసంతోత్సవానికి సన్నద్ధం

- 27వ వసంతంలోకి సాహితీ సమాఖ్య
- ఉగాది నాడు విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ వసంతోత్సవం
- ఏర్పాట్లు చేస్తున్న సంస్థ సభ్యులు
- ఒకే వేదికపై 26 ఏళ్లుగా వివిధ రంగాల్లో ప్రముఖులకు సత్కారం
- ఇప్పటి వరకు 270 మందికి పైగా పురస్కారాలు
- సాహిత్యాభిమానుల ప్రశంసలు



ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పాత గుంటూరు: సాహిత్యంతో సమాజంలో ఎంతటి మార్పునైనా తీసుకురాగలమనే లక్ష్యంతో నగరంలో సాహితీ సమాఖ్య సంస్థ స్థాపించబడింది. 1997లో సాహిత్యాభిమాని ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ వ్యవస్థాపక కార్యదర్శిగా మిత్ర బృందంతో కలిసి నెలకొల్పారు. ప్రతి ఏడాది ఉగాది రోజున 'సాహితీ వసంతోత్సవం' పేరుతో విశేష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత 26 ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లో తెలుగు సాహిత్యంలో విశేష ప్రతిభ కలిగిన ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేస్తూ సత్కరిస్తున్నారు. ఇప్పటి వరకు 270 మందికి పైగా సుప్రసిద్ధ కవులు, కవయిత్రులు, కార్టూనిస్టులు, గురుస్వాములు, యువ కవులకు పుర స్కారాలు అందించారు. సినీ ప్రముఖులు కె. విశ్వనాథ్, గుమ్మడి వెంకటేశ్వరరావు, గొల్లపూడి మారుతీరావు, సింగీతం శ్రీనివాసరావు, చంద్రబోస్, సిరివెన్నెల సీతారామశాస్త్రి, అనంత శ్రీరామ్, వేటూరి సుందరరామ్మూర్తి, మాడుగుల నాగఫణిశర్మ, గరికపాటి నరసింహారావు, పాపినేని శివశంకర్, వాడ్రేవు చిన వీరభద్రుడు, కొలకలూరి ఇనాక్, గోరటి వెంకన్న, అందెశ్రీ , వరంగల్ శ్రీనివాస్... ఇలా ఎంతోమందికి ఈ పురస్కారాలు వరించాయి.

సభా ప్రాంగణం ముస్తాబు

గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా సాహితీ సమాఖ్య ఉగాది పండుగ రోజు సాయంత్రం ఐదు గంటల నుంచి సాహితీ వసంతోత్సవ సభను నిర్వహిస్తుంది. పండుగకు ప్రతీకగా ప్రాంగణాన్ని, వేదికను తీర్చిదిద్దుతారు. మామిడి తోరణాలు, అరటి బోదెలు, కొబ్బరి ఆకులు, రకరకాల పూలతో వేదికను అలంకరిస్తారు. సభకు వచ్చే అతిథులంతా సంప్రదాయ దుస్తులతో హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. పంచాంగ పఠనం తర్వాత సాహితీ సమ్మేళనం, అతిథుల ఉపన్యాసాలు, పుస్తకావిష్కరణలు, పురస్కార ప్రదానాలు, కవితా ప్రదర్శనలు రాత్రి పది గంటల వరకూ కొనసాగుతాయి.

అందరూ ఆహ్వానితులే..

సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో క్రోధినామ సంవత్సరాన్ని పురస్కరించుకుని 27 వసంతాల సాహితీ వసంతోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంప్రదాయ వస్త్రధారణతో సభలో పాల్గొనాలని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ, నాదస్వర కచేరి, వేద పఠనం, పంచాంగ శ్రవణం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సభకు కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాద్, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ సినీ రచయిత చంద్రబోస్‌కు క్రోధి నామ ఆత్మీయ సత్కారం, సుప్రసిద్ధ పండితులు అవధాని డాక్టర్. ధూళిపాళ మహాదేవమణికి క్రోధినామ సాహితీ పురస్కారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జరిగే సాహితీ సమ్మేళనంలో సాహిత్యాభిమానులందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కార్యదర్శి ఆర్. రాము, రవి శ్రీనివాస్, టీయంటీ ట్రస్ట్ కార్యదర్శి పి. రామచంద్రరాజు పాల్గొని ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరించారు.

పర్యావరణంతోనే మానవాళి మనుగడ



వ్యాసరచన పోటీల విజేతలతో రోటరీ బాధ్యులు

తెనాలి: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యపడుతుందని, లేకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందని రోటరీ క్లబ్, తెనాలి అధ్యక్షుడు పావులూరి రాంబాబు అన్నారు. రోటరీ పర్యావరణ మాసంలో భాగంగా పర్యావరణంపై స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. రోటరీ డిస్ట్రిక్ట్ న్యూ క్లబ్ చైర్‌పర్సన్ ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూనే పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. రెండు విభాగాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జూనియర్స్‌లో అమల(ప్రథమ), షేక్ సిద్దిక్(ద్వితీయ), మేఘన (తృతీయ), సీనియర్స్‌లో కె.ప్రసంగి(ప్రథమ), కె.షైని(ద్వితీయ), సీహెచ్ నవీన(తృతీయ) బహుమతులను అందుకున్నారు. వీరితోపాటు పోటీల్లో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతిగా పరీక్ష ప్యాడ్‌లను బహూకరించారు. కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్ ఎలక్ట్ ఈదర శ్రీనివాసరావు, ఆలపాటి కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్ల అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేష్

తెనాలిరూరల్: తెనాలి సబ్‌డివిజన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు పోలీసులు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ ఎం.రమేష్ ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, యూనిఫాం ధరించాలని, పరిమితికి మించిన ప్యాసింజర్‌లను ఎక్కించవద్దని పేర్కొన్నారు. ఓవర్ స్పీడ్‌గా డ్రైవ్ చేయవద్దని, ట్రాఫిక్ ఎక్కడ పడితే అక్కడ అడ్డంగా ఉండే విధంగా వాహనాలను ఆపరాదని, మద్యం తాగి ఆటోలు నడపకూడని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీల ఊరేగింపుల్లో ఆటోలను వినియోగిచాల్సి వస్తే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, ప్రచారాల్లో వినియోగించే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీజే సౌండ్ సిస్టమ్ పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దన్నారు. సమావేశంలో సీఐలు జి.దశరథరామారావు, ఎ.సుధాకర్, ఎస్.రమేష్‌బాబు, రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'గడప గడపకు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో రవీంద్రనాథ్ తదితరులు

నగరంపాలెం: సాహితీ ఉద్యమకారుడు వల్లూరు శివప్రసాద్ నాలుగు దశాబ్దాలుగా ఎన్నో చక్కని కథలు, నాటికలు రాశారని కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత అదనపు కమిషనర్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన కథలు హాస్యంతో పాటు ఆలోచింపజేసేలా ఉంటాయని చెప్పారు. వల్లూరు శివప్రసాద్ రచించిన 'గడప గడపకు' హాస్య, వ్యంగ్య కథా సంపుటి పుస్తక ఆవిష్కరణ సభ శనివారం రాత్రి బృందావన్ గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉత్తమ నాటక రచయితగా వల్లూరు శివప్రసాద్ ఆరుసార్లు రాష్ట్ర ప్రభుత్వ నంది బహుమతులు పొందారని తెలిపారు. కథా సంపుటిని ప్రముఖ సాహితీ విమర్శకురాలు సీహెచ్.సుశీల సమీక్షించారు. సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించగా, కొటక్ మహీంద్ర బ్యాంక్ విశ్రాంత అసోసియేట్ ఉపాధ్యక్షుడు పి.వీరారెడ్డి తొలి ప్రతిని అందుకున్నారు. అనంతరం రచయిత వల్లూరు శివప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు వల్లూరు తాండవకృష్ణ, సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం నాయకులు టి.వివేకానంద, గుమ్మడి సీతారామయ్యచౌదరి, పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను పండించటంతోపాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చుని ఏపీ రైతు సాధికారసంస్థ ఎస్ఎఫ్ఏ ఉమాదేవి తెలిపారు. శనివారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో రైతు వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో నవధాన్యాలు పండిస్తున్న రైతులు, సేంద్రియ వ్యవసాయ చేస్తున్న రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆశయంతో రాష్ట్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం పేరుతో రైతు సాధికార సంస్థ ద్వారా ఒక వినూత్న పథకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే ఈ లాభసాటి వ్యవసాయం భూసార పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగల శక్తి ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమని చెప్పారు. రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయ విధానం అవలంబిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయానికి కావలసిన ఆవు పేడ, ఆవు మూత్రంతో తయారయ్యే ఉత్పత్తులు, ఇతర వస్తువులు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి రైతులచేత నడిపించే షాప్‌లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రపంచ దేశాలు ప్రకృతి వ్యవసాయ విధానం వైపు ఆకర్షితమవుతున్నాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాలు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.

● నేడు స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ

మంగళగిరి: పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 7వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు మంగళగిరి సాహితి కళా వేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ చేయనున్నట్లు కళావేదిక ప్రతినిధులు తెలిపారు. ఈసందర్భంగా శనివారం కళావేదిక కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు.